

# సాక్షి

## మల్లాది వెంకటకృష్ణమూర్తి

గన్నవరం నించి హైదరాబాద్ వచ్చిన గంగయ్య అబిడ్స్‌లోని ఓ హోటల్‌లో గది తీసుకున్నాడు. మర్నాడు వుదయం అతను పనిమీద సెక్రటేరియెట్‌కి వెళుతూ హోటల్‌లోని రిసెప్షనిస్ట్‌ని అడిగాడు–

"నేను సిటీకి కొత్త. ఎవరయినా డబ్బు కొట్టేయచ్చు. మీ దగ్గర వుంచుతారా?"

"ఎంత?" అడిగాడు క్లర్క్ అచ్చం పల్లెటూరి రైతులా వున్న గంగయ్య అవతారం చూసి.

"అయిదు వందల రూపాయిలు".

"ఇవ్వండి" చెప్పాడతను.

గంగయ్య అయిదు వందల రూపాయిలు రిసెప్షనిస్ట్‌కి ఇచ్చి సెక్రటేరియెట్‌కి వెళ్లాడు. అతను తన పని ముగించుకుని మధ్యాహ్నం మూడున్నరకి హోటల్‌కి వెళ్లాడు. తిరిగి గన్నవరం వెళ్లడానికి రైలు టిక్కెట్ కొనుక్కోవడానికి అతనికి డబ్బు అవసరం వచ్చింది. హోటల్‌లోని ట్రావెల్ ఏజెంట్ ముందుగా డబ్బిస్తే రిజర్వేషన్ చేయించి పెడతానన్నాడు.

అతను రిసెప్షనిస్ట్ దగ్గరికి వెళ్లి అడిగాడు–

"నా అయిదు వందలు ఇస్తారా?"

"అయిదు వందలేమిటి?" అడిగాడు రిసెప్షనిస్ట్ ఆశ్చర్యంగా చూస్తూ.

"పొద్దున్న మీకు అయిదు వందలు దాచమని ఇచ్చాగా?" అడిగాడు గంగయ్య.

"నాకిచ్చారా? లేదే?"

"పొద్దున్న డ్యూటీలో వున్నది మీరేగా?" అడిగాడు గంగయ్య అనుమానంగా.

"నేనే"

"మీరయితే మీకే ఇచ్చాను. మీ ఆకుపచ్చ చొక్కా, కళ్ళజోడు నాకు గుర్తే" చెప్పాడు గంగయ్య.

"మీరు నాకు డబ్బేం ఇవ్వలేదే? ఇస్తే రసీదు ఇచ్చి వుంటాను. చూపించండి" అడిగాడు రిసెప్షనిస్ట్.

"మీరు రసీదేం ఇవ్వలేదు. అలా ఇస్తారని కూడా నాకు తెలీదు" చెప్పాడు గంగయ్య.

"ఐయామ్ సారీ. మీరు నాకు డబ్బు ఇవ్వలేదు కాబట్టి నేను మీకేం ఇవ్వాల్సింది లేదు" చెప్పాడు రిసెప్షనిస్ట్.

అతను తనని మోసం చేసాడని గ్రహించడానికి ఆట్టేసేపు పట్టలేదు గంగయ్యకి.

వాళ్లిద్దరి మధ్య సంభాషణ విన్న, ఆ హోటల్‌లో దిగిన మరొకతను గంగయ్యని పక్కకి పిలిచి చెప్పాడు–

"జరిగిందంతా విన్నాను. మీరు డబ్బు ఇస్తుండగా ఎవరయినా చూసారా?" అడిగాడు.

"లేదు"

"అదీ సంగతి. సాక్షి వుంటే అతను వచ్చినట్టు ఇచ్చేవాడు. నేను లాయర్‌ని. నే చెప్పినట్టు చేయండి. మీ అయిదు వందలు మీకు తిరిగి వస్తుంది. సరేనా?"

"ఏం చెయ్యాలో చెప్పండి. ఒకటా? రెండా? అయిదు వందలు" అరిచాడు అతను బాధగా.

ఓ గంటాగి ఆ లాయర్, గంగయ్య కలిసి రిసెప్షనిస్ట్ దగ్గరకి వెళ్లారు. గంగయ్య రిసెప్షనిస్ట్‌కి అయిదు వందలు ఇచ్చి చెప్పాడు–

"దీన్ని మీ దగ్గర సేఫ్ కస్టడీలో వుంచండి. రాత్రి తీసుకుంటాను".

"అలాగే" చెప్పాడు రిసెప్షనిస్ట్.

లాయర్ తన గది తాళం చెవులు ఇచ్చేసి బయటికి వెళ్లాక అడిగాడు గంగయ్య–

"అయిదు వందలకి రసీదు ఇస్తారా?"

లాయర్ ఎటూ చూసాడు కాబట్టి రసీదు ఇవ్వడానికి వెనకాడలేదు రిసెప్షనిస్ట్. గంగయ్య బయటికి వచ్చి చెప్పాడు లాయర్‌తో తనకి రసీదు ముట్టిందని.

"గుడ్. రాత్రి ఎనిమిదికి నే చెప్పినట్టు చేయండి" చెప్పాడు.

గంగయ్య రాత్రి ఎనిమిదికి రిసెప్షనిస్ట్ దగ్గరికి వెళ్లి రసీదిచ్చి అయిదు వందలు వెనక్కి తీసుకున్నాడు. మళ్లీ ఎనిమిదిన్నరకి వెళ్లి అడిగాడు గంగయ్య రిసెప్షనిస్ట్‌ని–

"దయచేసి నా అయిదు వందలు ఇస్తారా?"

"అయిదు వందలేమిటి?" అడిగాడు రిసెప్షనిస్ట్.

"ఇందాక మీకు దాచమని ఇచ్చింది".

"అరగంట క్రితమే తిరిగి ఇచ్చేసాగా!" అరిచాడు రిసెప్షనిస్ట్.

"ఊహూ. నాకివ్వలేదు"

"ఇచ్చాను"

"మీరిస్తుండగా ఎవరయినా చూసారా?" లాయర్ అడిగాడు.

రిసెప్షనిస్ట్ తల అడ్డంగా వూపాడు.

"అయితే మీరు చెప్పేది నమ్మలేను. అతను అయిదు వందలు ఇస్తుండగా చూసాను. తిరిగి ఇవ్వడం ఎవరూ చూడలేదు" చెప్పాడు లాయర్. గంగయ్య తెలివి అర్థం అవడంతో చేసేది లేక రిసెప్షనిస్ట్ వుదయం అతని దగ్గర తీసుకుని కొట్టేసిన అయిదు వందల రూపాయిలు తిరిగి ఇచ్చాడు. పోలీసులకి రిపోర్ట్ చేస్తే తన వుద్యోగం పోతుందని తెలుసు అతనికి. లాయర్ సాక్ష్యాన్ని పోలీసులు నమ్ముతారు.

గంగయ్య చేతిలోని ఆ అయిదు వందల రూపాయిలు అందుకుని లాయర్ తన జేబులో వుంచుకున్నాడు.

"ఇదేం పని?" అడిగాడు గంగయ్య ఆశ్చర్యంగా.

"నా సలహా ఫీజు ఇది" చెప్పాడు.

లిఫ్ట్ వైపు వెళుతున్న లాయర్ వంక గుడ్లప్పగించి చూస్తుండిపోయాడు గంగయ్య.



27-4-90 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక